

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

(కిందటి సంచికనుండి కొనసాగింపు)

**ఉదయం** నేను నిద్ర లేచేసరికి బయట స్నో పడుతుంది. అన్నయ్య లాప్‌టాప్‌లో పని చేసుకుంటున్నాడు.

"ఇవాళ ఏంటి ప్లాన్?" అడిగాను.

"ఇవాళ ఇంట్లోనే. స్నోన్ స్టార్మ్ ఉంది" అన్నాడు.

"అయితే స్నోలో ఆడుకుందామా?"

పెద్దగా నవ్వి "ఇంట్లో ఆడుకుందాంలే" అన్నాడు.

"ఇంట్లోనా? ఎలా?"

"పేకలాడదామా?"

ఇద్దరం కలిసి పేకలాడడం మొదలు పెట్టాము.

"నాకు పేకలాడితే మన చిన్నప్పటి రోజులు గుర్తొస్తాయి. అందరం కలిసి ఆడుకునేవాళ్ళం. గుర్తుందా?"

"లేదు అప్పుడు నేను చాలా చిన్న పిల్లనేమో."

"ఔను నువ్వు చాలా మిస్ అయిపోయావు. మేమంతా కలిసి ప్రతి సమ్మర్ ఎక్కడో అక్కడికి వెళ్ళేవాళ్ళం. నేను అలా కేరళా, ఆగ్రా, డెహరాడూన్, నైనిటాల్‌కి వెళ్ళాను."

"ఎవరెవరు?"

"పెదనాన్న ఆర్మీలో ఉన్నప్పుడు తను ఏ ఊరికి వెళితే ఆ ఊరికి. నువ్వు చిన్నపిల్లవి కాబట్టి అమ్మతో ఉండేదానివి."

"ఆర్మీలో ఉన్నప్పుడు సోల్జర్స్‌ని కలిసావా?"

"మిలటరీ బేస్‌లోనే ఉండేవాళ్ళు. ఆ తోటి ఆర్మీ పిల్లలతో కలిసి ఆడుకునేవాళ్ళం."

"ఎలా ఉండేది?"

"మామూలుగానే ఉండేది. సమ్మర్ హాలిడేస్ కాబట్టి పిల్లలంతా ఫ్రెండ్స్ అయిపోయాం."

"ఎవరైనా టచ్‌లో ఉన్నారా?"

"లేదు. సగం మంది పేర్లు కూడా గుర్తులేవు."

"దిగులుగా ఉండేది కాదా?"

"లేదు. అంత మంది పిల్లలు, అమ్మమ్మ, అంతా ఉండేసరికి దిగులుగా ఎప్పుడూ అనిపించలేదు."

"వార్‌ని చూసావా?"

"పిల్లలు ముందు బ్యాటింగ్, బౌలింగ్ అని వార్ చేసేవాళ్ళం" పెద్దగా నవ్వి "లేదు వార్ ఫీల్డ్‌లో మేము అసలు లేము. పెదనాన్న ఆర్మీ వాళ్లకి ఇన్స్ట్రక్షన్స్ ఇచ్చేవాళ్ళు. నాకు తెలిసి చైనా వార్ అయ్యాక మళ్ళీ ఆయన వార్ జోన్‌కి వెళ్ళలేదు."

"చైనా వార్ ఎప్పుడైంది?"

"నువ్వు పుట్టక ముందు" మళ్ళీ నవ్వాడు.

"ఎప్పుడైనా టెర్రరిస్ట్‌ని చుసావా?"

"లేదు. ఒకసారి మాత్రం కంపౌండ్ లోపల ఎవరో స్పై కనిపించారని విన్నాను. అప్పుడు చాలా పెద్ద తతంగం జరిగింది. కానీ నాకు పెద్దగా ఫుర్తులేదు."

"ఇంకా ఏమైనా గుర్తున్నాయా?"

"అప్పుడు పిల్లలంతా పెద్దయ్యాక ఆర్మీలో చేరాలనుకునేవాళ్ళం. నువ్వు దొంగ, పోలీస్ ఆడినట్టు మేము ఆర్మీ, టెర్రరిస్ట్ ఆడేవాళ్ళం. పాకిస్తాన్ నీ గుండు గొరిగిస్తాన్‌లాంటి డైలాగులు కొట్టేవాళ్ళం. ఆ రోజులే వేరు."

"నువ్వు కూడా ఆర్మీలో చేరదాం అనుకున్నావా?"

"యా. నీకు గుర్తుందా? నేను సెవెంత్ క్లాస్ అయిపోయాక ఒక మూడు నెలలు అత్తా పత్తా లేకుండా పోయాను?"

"కొంచెం.. కొంచెం."

"అప్పుడు ఆర్మీ ట్రైనింగ్ ఎలా ఉంటుందో చూడ్డానికి వెళ్ళాను."

"ఔనా. నువ్వు ట్రైనింగ్ తీసుకున్నావా?"

"లేదు. ట్రైనింగ్ తీసుకోలేదు కానీ చూడ్డానికి వెళ్ళాను. పెదనాన్న రోజూ నన్ను తీసుకెళ్ళి అక్కడ జవాన్లతో మాట్లాడించారు.  కొన్ని ఆబ్సటకుల్ కోర్స్ లాంటివి ప్రయత్నించాను కానీ అప్పుడు నాకు బలం లేదు."

"మళ్ళీ ట్రై చెయ్యలేదా పెద్దయ్యాక?"

"లేదు. సోల్జర్ అవ్వాలంటే అది వేరే మైండ్ సెట్ ఉండాలి."

"అంటే?"

"సోల్జర్ లైఫ్ అన్నిటికన్నా టఫ్. వార్ జరిగేప్పుడు చుట్టుపక్కల అంతా శవాలు, బాంబు పేలితే ఆ తుప్పలు, మట్టి, చనిపోయిన వారి రక్తం కూడా వాళ్ళ మీద చిందుతుంది. చుట్టూ అంతా ధ్వంశమే ఉంటుంది. వాళ్ళతో పాటు ట్రైనింగ్ తీసుకున్న వాళ్ళు, స్నేహితులు వాళ్ళ కళ్లముందే చనిపోయారు కూడా. వాళ్ళ శవాలని, లేదా విరిగిపడిన కాళ్ళూ, చేతులని వీళ్ళే మోసుకు రావాలి. ఎంత ఎండగా ఉన్నా ఆ గన్‌లు, బాంబులు అన్నీ వాళ్ళ ఆర్మీగియర్ వేసుకుని మోసుకుంటూ నడవాలి. అలా యుద్ధభూమిలోనే తినాల్సిన పరిస్థితులు కూడా వస్తాయి. వాళ్ళకి శరీర బలం, బుద్ధి బలంతోపాటు మనస్థైర్యం కూడా కావాలి. ఎవరు పడితే వాళ్ళు సోల్జర్స్ అవ్వలేరు."

అన్నయ్య చెప్పినవన్నీ ఊహిస్తూ గుండె కకావికలమైంది.

"అందుకే జై జవాన్, జై కిసాన్ అంటాము" అన్నాడు.

నేను నిశ్శబ్దంగా తలూపాను.

"ఏడుస్తున్నావా, ఏంటి?" అడిగాడు.

"లేదు. ఆ సోల్జర్స్ నీకు ఇవన్నీ చెప్పారా?" అడిగాను.

"కొన్ని వాళ్ళు చెప్పారు. కొన్ని సోల్జర్స్ బయోగ్రఫీలో చదివి తెలుసుకున్నాను.

"పెదనాన్న కూడా ఇలాంటి పరిస్థితి చూసారా?"

"లేదు. ఆయన ఇంజనియర్. ఆర్మీకి వార్‌లో పనిచేసారు కానీ సోల్జర్‌లాగా కాదు."

"మా పెదనాన్నకి ఏమీ కానందుకు మనసులో దేవుడికి దండం పెట్టుకున్నాను.

"ఇంకా చెప్పు."

"ఆర్మీ గురించా? చెప్పాలంటే చాలానే ఉంది కానీ నీ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. కొంపతీసి ఇప్పుడు ఏడుస్తావా, ఏంటి?"

"లేదు. నాకేం ఏడుపు రావట్లేదు" తల దింపాను.

"ఒక పని చెయ్యి. ఆ షెల్ఫ్‌లో 'మాజెస్టీస్  అపొనెంట్' అని పుస్తకం ఉంది. అది చదువు."

"సోల్జర్ రాసిందా?"

"లేదు. అది మన నేతాజీ సుభాష్ చంద్రబోస్ గారి బయోగ్రఫీ."

"ఫ్రీడం ఫైటర్ బయోగ్రఫీనా. చదువుతాను."

"ఆయనే మన దేశానికి మొట్ట మొదట అమ్మాయిలని ఆర్మీలో తీసుకుంది."

"ఔనా" ఆశ్చర్యపోయాను.

"ఔను. ఇండియన్ నేషనల్ ఆర్మీ ఆయన సృష్టించారు."

"ఓ. నాకు తెలియదు ఈ విషయం."

"ఆ పుస్తకం చదువు. ఇంకా చాలా తెలుస్తాయి."

"సరే రాత్రికి చదువుతా."

పేకలు పక్కన పెట్టి భోజనం చేసాము.

"ఇంట్లో చాలా డల్‌గా ఉన్నావు. పొద్దున లేవగానే ప్లాన్ ఏంటి అన్నావు. పోనీ బయటకి వెళ్దామా?" అడిగాడు.

"లేదు. సోల్జర్స్ గురించి ఆలోచిస్తున్నాను" బదులిచ్చాను.

"పోనీ నువ్వు అన్నట్టే బయట స్నోలో ఆడదామా?"

"లేదు. నేను కొంచెం సేపు పడుకుంటాను" భుక్తాయాసంతో చెప్పాను.

"అయ్యో. మరీ అంత దిగులు ఎందుకు? వాళ్ళు ఎంచుకున్న వృత్తి అది. అయినా ఇప్పుడు మనకి యుద్ధాలు లేవు కదా. పద వెళ్ళి స్నోలో ఇగ్లూ కడదాం."

"ఇగ్లూ నా? నీకు వచ్చా?" అడిగాను.

"లేదు. ప్రయత్నిద్దాం. దాంతో చీకటి పడిపోతుంది" నవ్వాడు.

నేను వెంటనే లోపలికి వెళ్ళి వింటర్ దుస్తులు వేసుకుని వచ్చాను.

"ఓ. అప్పుడే రెడీయా? సరే, నువ్వు వెళ్ళి ఆడుకుంటూ ఉండు. నేను పది నిమిషాల్లో వస్తాను" అన్నాడు.

"ఒక్కదాన్నేనా?"

బాల్కనీలోంచి చూసి, "పక్కింటివాళ్ళు కూడా ఉన్నారు.వాళ్ళతో ఆడుకో" అంటూ గదిలోకి వెళ్ళాడు.

నేను బయటకి నడుస్తుండగా ఆ పక్కింటి వాళ్ళ పేర్లు తెలీవని గ్రహించాను. వెనక్కి తిరిగే బదులు వాళ్లనే అడుగుదామని ముందుకి వెళ్ళాను.

"ఐ యాం అవని, అభిరామ్స్ సిస్టర్" పరిచయం చేసుకున్నాను.

"ఐ యాం జాస్మిన్, దిస్ ఈజ్ మై బ్రదర్ జాష్ అండ్ మై మదర్ మేరీ" అంది.

"కెన్ ఐ ప్లే విత్ యు?" అడిగాను.

ముగ్గురు మొహాలు చూసుకుని అనుమానంగా "షూర్" అన్నారు.

వాళ్ళు స్నో మాన్ తయారు చేస్తుంటే నేను సహాయపడ్డాను. నా ఫ్రెండ్స్‌తో జరిగిన స్నోమన్ పీటీ గురించి చెప్పడంతో మేము గోళ్ళులాగా ఎం అండ్ ఎమ్స్ ని పెట్టాము. కాస్త విచిత్రంగా కనబడినా, గోళ్ళు అంటే నమ్మేట్లుగానే ఉన్నాయి. మేము స్నో మాన్‌కి ఏం పేరు పెట్టాలని ఆలోచిస్తుండగా నా మీద స్నో పడింది. తిరిగి చూస్తే అన్నయ్య.

"స్నో ఫైట్" అని జాష్ అరిచాడు.

అన్నయ్య వచ్చి "ఐయాం అభి, యువర్ నెయిబర్" అని పరిచయం చేసుకున్నాడు. ఆ తరవాత అందరం స్నోతో ఒకరిని ఒకరు కొట్టడం ప్రారంభించాము. ఈలోగా వెంటనే చీకటి పడడంతో లోపలికి వెళ్ళిపోయాము.

"వాళ్ళని పరిచయం చేసుకున్నట్టు ఉంది, హాయ్ చెప్పినట్టు లేదు" హేళన చేసాను.

"నేను చేసింది కూడా అదే" అన్నాడు.

"అదేంటి?" అర్థంకాక అడిగాను.

"వాళ్లని నేను ఇదే మొదటిసారి కలవడం. వెటకారంగా పక్కింటి వాళ్ళతో ఆడుకో అంటే నిజంగానే ఆడావు" పెద్దగా నవ్వాడు.

"అలిసిపోయాను కాబట్టి ఊరుకుంటున్నా. లేకపోతే..." అన్నాను.

"స్నానం చేసిరా ఆకలేస్తుంది. తిందాం" అన్నాడు.

ఇద్దరం కలిసి భోంచేస్తూ జగదేకవీరుడు అతిలోక సుందరి సినిమా చూసాము.

"శ్రీదేవి ఎంత బావుందో ఈ సినిమా చూసాము.

"శ్రీదేవి ఎంత బావుందో ఈ సినిమాలో" అన్నాను.

"చిరంజీవి కూడా బావున్నాడు" అన్నాడు.

" ఆ అలాఉద్దీన్ కుక్కని చూసి పిల్లలు బానే భయపడకుండా ఉన్నారు."

"అందరూ నీలా భయపడతారనుకున్నావా?"

"నాకేం భయంలేదు."

"తెలుసు" ఎగతాళి చేసాడు.

"ఇంకో రౌండ్ పేకాడదామా?" అడిగాడు.

"మూడు రౌండ్లు ఆడదాం. తరవాత పడుకుంటాను."

"సరే. ఈసారి నువ్వు నాకు తెలియని సంగతులేమైనా చెప్పు."

"నీకు గుర్తుందా? ఓసారి ఊళ్ళో వరి పెట్టిన గదిలో ఆరెంజ్, అరటి పండు తొక్కలున్నాయని తాతయ్య బాగా కోప్పడ్డాడు?"

"అవి నువ్వే పడేసావా?"

"నేను ఆరెంజ్ పడేస్తే రోహన్ అరటిపండు తొక్క పడేసాడు."

"ఒసేయ్. ఫ్లవర్ వేజ్ విరక్కొట్టడం, అరటి పండు తొక్క విసిరేయడం కాకుండా మామూలు కథలు లేవా నీ దగ్గర?" అడిగాడు.

కాస్త చిన్నబోయి ఏమీ మాట్లాడలేదు.

"రేపు స్నో పడకపోతే మ్యూజియంకి వెళదామా?" అడిగాడు.

ఏ మ్యూజియం?"

"ఆర్ట్ మ్యూజియం. స్కల్ప్చర్స్ ఎగ్జిబిషన్ ఉందట."

"యా వెళ్దాము."

కొద్దిసేపు అయ్యాక "ఆక్చుల్‌గా ఒకటి చెప్పాలి" అన్నాను.

"పెరటిలో మామిడికాయ టెంక విసిరేసావా?" నవ్వాడు.

"లేదు. నిజంగా చెప్పాలి" అన్నాను.

"సరే. ఏంటి?"

"నాకు బొమ్మలంటే చాలా భయం."

"అదేంటి? ఎప్పటినుంచి?"

"గుర్తున్నప్పటి నుండి నాకు బొమ్మలు చాలా భయం. కానీ నువ్వు రాత్రి నా మంచం మీద అన్నీ బొమ్మలు పెట్టేవాడివి."

"నీకు ఇష్టమని నీకు రెండు పక్కలా రెండు బొమ్మలు పెట్టేవాడిని. నీకు నచ్చేది కాదా?"

"లేదు. భయం వేసేది."

"మరి ఎప్పుడూ చెప్పలేదేంటి?"

"నాన్నతో చెప్పాను. అన్నయ్య పెడితే దెయ్యాలుండవు అనేవారు."

"అయినా భయమేసేదా?"

"ఔను. నాన్నకి కూడా చెప్పాను కానీ కళ్ళు మూసుకుని పడుకో,అదీ, ఇదీ అనేవారు."

"మరి ఏం చేసేదానివి?"

"శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం తలచుకుంటూ ఆ రెండు బొమ్మలు విసిరేసేదాన్ని."

పెద్దగా నవ్వి "బొమ్మలు లేకపోతే నువ్వు కింద పడుండేదానివి అని నేను, అమ్మ అనుకునేవాళ్ళం. అందుకే రోజూ గుర్తు పెట్టుకుని మరో నీ పక్కన బొమ్మలు పెట్టేవాడిని" నవ్వాడు.

"ఔనా. నాకు అది తెలీదే."

ఇద్దరం చాలాసేపు నవ్వుకున్నాం. ఆ తరవాత వెంటనే నిద్రపోయాము.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story